చెరువు చేపలకు భలే గిరాకీ



- సముద్ర వేట నిషేధంతో సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు
- మార్కెట్‌లో కిలో రూ.250 వరకు విక్రయాలు
- ధర ఎక్కువైనా ఎగబడుతున్న జనం



పూర్ణా మార్కెట్ వద్ద చేపల బజార్‌లో జనం రద్దీ

జగదాంబ: సముద్రంలో మత్స్యకారుల వేట నిషేధంతో చెరువు చేపలకు గిరాకీ బాగా పెరిగింది. ఏటా 61 రోజుల పాటు మత్స్య వేట నిషేధ విషయం తెలిసిందే. జూన్ 15 తర్వాత తిరిగి బోట్లు సముద్రంలోకి వెళ్లనున్నాయి. అప్పటి వరకు మార్కెట్‌లో సముద్రపు చేపలు కనిపించక పోవడంతో చెరువు చేపల వంతు వచ్చింది. వ్యాపారులు ఒక్కసారిగా డిమాండ్ పెంచేశారు. మార్కెట్‌లో ఇరత మాంసాహారాలు ఉన్నప్పటికీ జనం చెరువు చేపల వైపే మొగ్గు చూపుతున్నారు. దీంతో వ్యాపారులు కిలో రూ.150 ఉండే చేపల ధరను అమాంతం రూ.250కు పెంచేసి సొమ్ము చేసుకుంటున్నారు.

చెరువు చేపల దిగుమతులిలా..

నగరంలో చెరువు చేపలకు డిమాండ్ ఎక్కువగా ఉండటంతో తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి అధిక మొత్తం దిగుమతి అవుతున్నాయి. శని, సోమ, గురువారాల్లో రాత్రి వేళ్లలో గాజువాక, పూర్ణా మార్కెట్ దరి ఫ్రూట్ మార్కెట్, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బజార్, గోపాలపట్నం వంటి ప్రధాన మార్కెట్‌లకు వివిధ రకాల చెరువు చేపలను తీసుకొస్తున్నారు. ఉభయ గోదావరి జిల్లాలతో పాటు విజయనగరం, శ్రీకాకుళం డ్యాం నుంచి కూడా చేపలు భారీగా నగరానికి వస్తున్నాయి. ప్రధానంగా నగరంలోని మేఘాద్రి గెడ్డ, ఆనందపురం, తరగపువలస నుంచి చెరువు చేపలు రోజూ మార్కెట్‌లో హోల్‌సేల్ వ్యాపారాలు చేస్తుంటారు. వీటన్నింటినీ నగర నలుమూలల్లో ఉన్న చిన్న చిన్న మార్కెట్ల వద్ద విక్రయిస్తున్నారు.



చెరువు చేపలు విక్రయిస్తున్న వ్యాపారులు

ఈ చేపలకు డిమాండ్..

ప్రస్తుతం మార్కెట్‌లో లభించే బొచ్చు, శీలావతి, జడ్డువా, బంగారుపాప, సందువ వంటి రకాల చెరువు చేపలకు ఎక్కువగా డిమాండ్ ఉంది. చేపల బరువును బట్టి ధరలను కూడా అప్పటికప్పుడు వ్యాపారులు పెంచేస్తుంటారు. ప్రధాన మార్కెట్లకు వచ్చే చేపలను బట్టి వాటి ధరలను వ్యాపారులు తారుమారు చేసేస్తారు. వినియోగదారులకు ఈ విషయం తెలిసినా.. చేపల ధరలు ఇలా పెంచేశారేమని అడగడం తప్ప.. చేసేందేమి లేక కొనుగోలు చేసుకుపోతున్నారు.

తూనికల్లో మోసాలు..

చేపల మార్కెట్ల వద్ద ధరలతోపాటు తూనికల్లో మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వ్యాపారుల వద్ద ఎలిక్ట్రికల్ కాటా ఉన్నా.. ఎక్కువగా చేతి కాటాను వాడుతున్నారు. దీనిలో రెండు రకాల తూనిక రాళ్లు ఉంటాయి. కేజీకి సంబంధించి రెండు, అర కేజీకు సంబంధించి రెండు రాళ్లు వినియోగిస్తారు. కేజీలు పెరిగే కొద్ది రాళ్లు ఉంటాయి కానీ.. తక్కువ బరువుండే రాళ్లు పెట్టి తూనికలు కొలుస్తుంటారు. దీనివల్ల చేపలు తక్కువ బరువున్న రాళ్లపై ఎక్కువ కేజీలు చూపించి అధిక మొత్తంలో వినియోగదారుల వద్ద నుంచి డబ్బులు గుంజుతున్నారు. ఇంత పెద్ద తంతు జరుగుతున్నా.. ఏ మార్కెట్ వద్ద కూడా లీగల్ మెట్రాలాజీ (తూనికలు, కొలతలు శాఖ) అధికారులు కనీసం పట్టించుకున్న దాఖలాలు కానరావడం లేదు.

ధర ఎక్కువైనా కొంటున్నాం

చికెన్ ధరలు పెరగడంతో చేపల వైపు పరిగెడుతున్నాం. అక్కడ కూడా ధరల్లో వ్యత్సాసాలు, కాటాల్లో మోసాలు జరుగుతున్నాయి. చెరువు చేపలకు డిమాండ్ ఉన్నా.. కొనక తప్పడం లేదు.

– నాయిని నాగభూషణం, బౌడారా రోడ్డు

చెరువు చేపలు రుచికరం

చెరువు చేపలు రుచిగా ఉంటాయి. ఇందులో బంగారు పాప ప్రత్యేకం. అందుకే ప్రతి వారం చెరువు చేప లు కచ్చితంగా కొని తింటాం. ధరలు పెంచే సి విక్రయిస్తున్నారని తెలిసినా కొంటున్నాం.

–బి.శంకర్‌రెడ్డి, పండా వీధి, పూర్ణా మార్కెట్

క్లుప్తంగా

జోన్-4లో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మేయర్

దాబాగార్డెన్స్: వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని జీవీఎంసీ అన్ని జోన్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మేయర్ పీలా శ్రీనివాసరావు తెలిపారు. జోన్-4 పరిధి జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమీపాన శుక్రవారం పర్యావరణహిత చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, కార్యాలయ ఇన్‌చార్జి సహాయక ఇంజినీర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు స్పందన కరవు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జీవీఎంసీ సిటీ ప్లానర్ ధనుంజయ్‌రెడ్డి

దాబాగార్డెన్స్: జీవీఎంసీలో శుక్రవారం నిర్వహించిన టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు స్పందన కరువైంది. సోమవారం ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేస్తున్నా అధికారులు మాత్రం పెద్దగా పట్టించుకోవడం లేదనే విమర్శల నేపథ్యంలో ఓపెన్ ఫోరమ్‌కు కూడా ఎవరూ పెద్దగా రాలేదు. కేవలం 4 వినతులు మాత్రం వచ్చాయి. ఈ వినతులను జీవీఎంసీ సిటీ ప్లానర్ కె.ధనుంజయ్‌రెడ్డి స్వీకరించారు.

కౌమార దశపై అవగాహన



అవగాహన పోస్టర్ ప్రదర్శిస్తున్న కిశోర బాలికలు

మద్రిపాలెం: కౌమార దశపై అవగాహన కలిగి ఉండాలని కిశోర టీం సభ్యులు అన్నారు. శుక్రవారం జీవీఎంసీ 51వ వార్డు గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరీ వికాసం సమ్మర్ క్యాంపెయిన్ ద్వారా కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కిశోర బాలికలు ఒకరినొకరు పరిచయం చేసుకోవడం ,లక్ష్యాలు నిర్ధారించుకోవడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. కౌమారబాలికలను సాధికారపరచడం, రక్త హీనత సమస్యను అధిగమించేలా చేసి, చదువు, వృత్తుల్లో వారికి సహాయం చేయడం, ఆరోగ్య సంరక్షణను ప్రోత్సహించేందుకు ఈ వేసవి శిబిరం ఉపయోగపడుతుందన్నారు. ఆ దిశగా తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను చైతన్యం పరచడంలో దృష్టిసారించాలని సూచించారు. కార్యక్రమంలో కిశోర టీం కన్వీనర్ (మహిళా సంరక్షణ కార్యదర్శి) వరలక్ష్మి,అంగన్‌వాడీ టీచర్ మౌలా బీబీ, ఏఎన్ఎం టి.స్రవంతి,ఆశ వర్కర్ వెంకటలక్ష్మి, కిశోర బాలికలు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో 32.5 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్ మీదుగా గంజాయిని రవాణా చేస్తున్న వ్యక్తులను విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో రైల్వే పోలీసులు అరెస్టు చేసి, 32.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విశాఖపట్నం జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్పీ సిబ్బంది, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో పలు ప్లాట్‌ఫాంలలో తనిఖీలు నిర్వహించారు. మహారాష్ట్రలోని థానే జిల్లాకు చెందిన లక్ష్మణ్ ఎస్.భండారి, తిప్పేగారి బుగ్గమ్మలు విశాఖ స్టేషన్ మీదుగా ముంబైకి గంజాయిని రవాణా చేస్తుండడాన్ని గుర్తించి, అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రూ.1.62లక్షల విలువైన 32.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరచినట్టు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

అప్పన్నకు నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింజేశారు. ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. వివిధ ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.

పరిసరాల శుభ్రతతో డెంగ్యూ నివారణ

- డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు
- డెంగ్యూ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: పరిసరాల పరిశుభ్రతతో డెంగ్యూను నివారించవచ్చని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. రేసపువానిపాలెం డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద మొదలైన ర్యాలీ సత్యం కూడలి మీదుగా తిరిగి డీఎంహెచ్‌వో కార్యాలయం వరకు సాగింది. ఈ ర్యాలీని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ 1964లో విశాఖలో తొలి డెంగ్యూ కేసు నమోదైందన్నారు. అప్పుడు ఈ వ్యాధి దోమ ద్వారా వచ్చిన వైరస్‌గా గుర్తించి చికిత్స అందించారని తెలిపారు. జ్వర లక్షణాలను వివరించారు.. జ్వరం ఉధృతంగా రావడం, కండరాలు కీళ్ల నొప్పులు, వాంతి వచ్చినట్టుగా భ్రాంతి ఉంటుందన్నారు. నోరు ఎండిపోవడం, రక్తపోటు నమోదు చేయలేనంతగా పడిపోవడం జరుగుతాయన్నారు.

డ్రైడే పాటించాలి..

ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు డాక్టర్ పి.రాధారాణి మాట్లాడుతూ డెంగ్యూను సకాలంలో గుర్తించి, చికిత్స అందిస్తే రోగిని కాపాడుకోవచ్చన్నారు. అలాగే వారానికి ఒకరోజు డ్రై డే పాటించడం, దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఈ జ్వరాన్ని అదుపులో ఉంచవచ్చని సూచించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ అడిషనల్ డైరెక్టర్ కేవీఎస్ ప్రసాద్, జిల్లా మలేరియా అధికారి తులసి, జీవీఎంసీ బయోలజిస్టు జి.సాంబమూర్తి, జిల్లా ప్రోగ్రాం అధికారులు, మలేరియా సిబ్బంది, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సీపీ శంఖబ్రత బాగ్చీ



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

అక్కిరెడ్డిపాలెం: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. గాజువాక సెలస్ట్ గేటెడ్ కమ్యూనిటీలో శుక్రవారం రాత్రి సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ సైబర్ నేరాల వల్ల పౌరులు ఎలా నష్టపోతున్నారు... నేరాలను ఎలా అరికట్టాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. దేశంలో సైబర్ నేరాలు ఎక్కువయ్యాయన్నారు.దేశంలో దారిదోపిడీ, హౌస్ బ్రేకింగ్ వంటి నేరాల్లో రూ.80 కోట్లు తస్కరిస్తే... సైబర్ నేరాల్లో రూ.220 కోట్లకు పైగా నేరగాళ్లు తస్కరించారన్నారు. పెహల్గాం ఘటన తర్వాత పాకిస్తాన్ హ్యాకర్స్ ఇండియన్ వెబ్‌సైట్లను హ్యాక్ చేశారన్నారు. గాజువాక సీఐకు నగర పోలీస్ కమిషనర్ డబ్బులు అడుగుతున్నట్టు మెసేజ్ వచ్చిందన్నారు. సీఐ ఫోన్ చేయడంతో అసలు విషయం బయట పడిందన్నారు. కస్టమర్ కేర్ ఫ్రాడ్, యూపీఐ లాటరీ, జాబ్ కేవైసీ ఫ్రాడ్‌లలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ స్టాకింగ్ ఫ్రాడ్ వల్ల మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. వెబ్‌సైట్లను విజిట్ చేస్తే సైబర్ నేరగాళ్లు కనిపెడుతూనే ఉంటారని.. అలాంటి వారిని డిజిటల్ అరెస్ట్ పేరిట బయపెట్టి డబ్బులు డిమాండ్ చేస్తారని వివరించారు. ఎవరు భయపడకుండా సైబర్ నేరగాళ్ల బారిన పడిన వెంటనే 1930కు ఫోన్ చేస్తే వారి బారి నుంచి బయటపడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో డీసీపీ– 2 మేరీ ప్రశాంతి, ఏసీపీ టి.త్రినాథ్, సీఐ పార్థసారథి, క్రైం సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ రవి కుమార్, సెలస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మామిడి పంట ఆదాయంలో హెచ్చుతగ్గులు



విశాఖ కేంద్ర కారాగారంలో మామిడి తోట

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో మామిడి పంట ద్వారా వచ్చే ఆదాయంలో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. ఇక్కడ ఒక ఏడాది పంట దిగుబడి బాగుంటే.. మరుసటి ఏడాది పంట తగ్గిపోతోంది. పంట దిగుబడిలో మార్పుల వల్ల జైలుకు వచ్చే ఆదాయంలో కూడా హెచ్చు తగ్గులు వస్తున్నాయి. జైలు ఆవరణలో పండిన మామిడి పంటను అధికారులు ఏటా వేలం వేస్తుంటారు. ఇందులో భాగంగానే ఈ ఏడాది వేలం పాట నిర్వహించగా.. ఓ వ్యాపారి రూ.1.30 లక్షలకు దక్కించుకున్నాడు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది రూ.50వేలు అధికంగా ఆదాయం లభించింది. జైలు ఆవరణలోని మామిడి తోట నుంచి 2020లో రూ.65 వేల ఆదాయం లభించగా, 2021లో రూ.1,00,200, 2022లో రూ.52వేలు, 2023లో రూ.1.40లక్షలు, 2024లో రూ.80 వేలు, 2025లో రూ.1.30లక్షలు ఆదాయం వచ్చింది. ఇలా గత ఆరేళ్లలో ఒక సంవత్సరం ఆదాయం తగ్గడం, మరుసటి సంవత్సరం పెరగడం గమనార్హం.

ఆంధ్రా యూనివర్సిటీ గ్రౌండ్‌లో జరుగుతున్న సమ్మర్ కోచింగ్ క్యాంప్ క్రీడాకారులతో సందడిగా మారింది. క్రీడాకారులు ఉత్సాహంగా బాస్కెట్‌బాల్‌లో మెళకువలు నేర్చుకుంటున్నారు. నిష్ణాతులైన కోచ్‌ల ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్నారు.

– ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం



క్షీరాభిషేక సేవలో అమ్మవారు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి తులసి పూజ..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

జీవనజ్యోతి పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శోభన్‌బాబు సేవా సంఘు సభ్యులు

గోపాలపట్నం: శోభన్ బాబు, వాణిశ్రీ జంటగా కె. విశ్వనాథ్ దర్శకత్వంలో వచ్చిన జీవన జ్యోతి సినిమాకు 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శోభన్ బాబు సేవాసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పద్మనాభనగర్‌లో సంబరాలు నిర్వహించారు. శోభన్ బాబు సేవా సంఘం అధ్యక్షుడు నందవరపు సోములు మాట్లాడుతూ 1975లోనే హిట్‌గా నిచిందన్నారు. తెలుగు ప్రజలు మర్చిపోలేని సినిమా అని కొనియారు. సినిమాకు 50ఏళ్లు పూర్తయిన సందర్భంగా జీవన జ్యోతి పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కంపర అప్పారావు, కంచిపాటి నగరాజు, కంపర కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

18న తెలుగు కళా సమితి స్వర్ణోత్సవ ప్రదర్శన

మద్దిలపాలెం: తెలుగు కళా సమితి స్వర్ణోత్సవ ప్రదర్శన, 14వ జాతీయ స్థాయి తెలుగు నాటిక రచనల పోటీల బహుమతి ప్రదానోత్సవాన్ని ఈ నెల 18న కళా భారతి ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు సమితి కార్యదర్శి వై.ఎస్.కె.ఎన్. స్వామి తెలిపారు. ఈ సందర్భంగా 'నిశ్శబ్దమా నీ ఖరీదు ఎంత' అనే నాటిక 50వ ప్రదర్శనను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ ఏడాది నిర్వహించిన 14వ జాతీయ స్థాయి తెలుగు నాటిక రచనల పోటీలకు విశేష స్పందన వచ్చిందని.. ఉత్తమ రచనగా 'రిక్వెస్ట్', ద్వితీయ ఉత్తమ రచనగా 'క్రతువు', తృతీయ ఉత్తమ రచనగా 'మూగబోయిన సాక్ష్యం' ఎంపికైనట్లు వెల్లడించారు. 'విష కుంభం', 'ఖని కోరని భ్రమణం' నాటికలు జూరీ బహుమతులు గెలుచుకున్నట్లు చెప్పారు. తెలుగు నాటకరంగ ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరై.. బహుమతి ప్రదానోత్సవంతోపాటు కళాకారులు జ్ఞాపికలు ప్రదానం చేస్తామన్నారు. రావులపాలేనికి చెందిన డాక్టర్ గొలుగూరి విక్టరీ వెంకట్ రెడ్డికి ప్రత్యేక పురస్కారం అందజేస్తామని చెప్పారు.

ప్రజా భాగస్వామ్యంతో డెంగ్యూ నిర్మూలన



మాట్లాడుతున్న అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాదరావు

దాబాగార్డెన్స్: డెంగ్యూను నిర్మూలించే దిశగా పయనిద్దామని, ప్రజల భాగస్వామ్యంతో ఈ వ్యాధిని సమర్థవంతంగా నియంత్రించవచ్చని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ మలేరియా కె.వి.ఎస్.ప్రసాదరావు అన్నారు. నేషనల్ డెంగ్యూ డే సందర్భంగా శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద అవగాహన కార్యక్రమం, ప్రదర్శన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఏడిఎస్ దోమలు కుట్టడం వల్ల డెంగ్యూ జ్వరాలు వ్యాపిస్తాయన్నారు. రానున్న వర్షా కాలంలో దోమలు వృద్ధి చెందే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున అవి పెరిగే ప్రదేశాలు, వాటి నియంత్రణ చర్యలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడం ద్వారా డెంగ్యూ జ్వరాల వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. జిల్లా మలేరియా అధికారి ఎం.తులసి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఫ్రైడే–డ్రైడే కార్యక్రమం పటిష్ఠంగా అమలు చేయడం, ప్రజలను భాగస్వామ్యం చేయడం ద్వారా దోమల వృద్ధిని అరికట్టి జ్వర పీడితులను సంఖ్యను అదుపు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ బయాలజిస్ట్ సాంబమూర్తి, ఎంపీహెచ్‌ఈవో తిరుపతిరావు, సబ్ యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్, హెల్త్ సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, జీవీఎంసీ యాంటీ లార్వా ఆపరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం పదిలం



అంగన్‌వాడీ కేంద్రంలో బాలికలు, సిబ్బంది

అల్లిపురం: బాలికలకు చాలా ముఖ్యమైన కౌమార దశలో రక్తహీనత బారిన పడకుండా జాగ్రత్త వహించాలని అంగన్‌వాడీ కార్యకర్త అరుణ ప్రియ సూచించారు. అమ్మవారి వీధి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌమార దశ ఆడపిల్లల్లో ఐరన్ శాతం తక్కువగా ఉంటుందన్నారు. ఈ సమయంలో ఐరన్ శాతం ఎక్కువగా ఉండే క్యారెట్, బీట్‌రూట్, ఆకుకూరలు, గుడ్లు, మాంసాహారం, డ్రై ఫ్రూట్స్ వంటి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం కె.తులసి, ఆశ వర్కర్ సూర్యకుమారి, అంగన్‌వాడీ వర్కర్ బి.అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

'మాల'లను విస్మరిస్తున్న కూటమి ప్రభుత్వం

అల్లిపురం: కూటమి ప్రభుత్వం మాల సామాజిక వర్గం వారికి ఏమీ చేయడం లేదని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పాకా సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి పాలనలో మాలలను విస్మరించి, నిర్లక్ష్యం వహిస్తున్నారని, అన్ని పోస్టులు, నామినేటెడ్ పదవులను మాదిగలకే ఇస్తున్నారని ఆరోపించారు. భారతదేశాన్ని నాశనం చేయాలని పాకిస్థాన్ ఎంత పగతో చూస్తుందో.. అదే మాదిరిగా కూటమి ప్రభుత్వం మాలలను నాశనం చేసేందుకు ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో మాల వర్గీయులు అధిక భాగం ఉన్నారని, వారు వచ్చే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వాన్ని నామరూపాలు లేకుండా చేస్తారని హెచ్చరించారు. ప్రజలు అధికారమిచ్చింది రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తారనే తప్ప.. కక్ష సాధింపుల కోసం కాదని హితవు పలికారు. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను, సూపర్ సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం సక్రమంగా అమలు చేయాలని సూచించారు.

వలంటీర్ వైద్య ఖర్చులకు వాసుపల్లి చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న వాసుపల్లి

దాబాగార్డెన్స్: గత ప్రభుత్వంలో వలంటీర్‌గా చేసిన అంగటి శ్రీనివాసరావు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండటంతో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. 27వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి శ్రీనివాసరావు ఇంటికి వెళ్లి, పరామర్శించిన ఆయన వారికి భరోసా కల్పించారు. 27వ వార్డు దొండపర్తి నెహ్రూబజార్ 143 సచివాలయంలో అంగటి శ్రీనివాసరావు, ఆయన భార్య పార్వతి ఇద్దరూ వలంటీర్లుగా సేవలు అందించేవారు. కూటమి ప్రభుత్వం వలంటీర్లను తొలగించడంతో ఉపాధి కోల్పోయి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారిపై విధి కన్నెర్ర చేసింది. కీళ్ల నొప్పులతో బాధపడుతూ ఆస్పత్రికి వెళ్లిన శ్రీనివాసరావుకు జీవితాంతం ఇంజక్షన్లు ఉపయోగించాలని వైద్యులు సూచించారు. ఇద్దరు చిన్నారులతో కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతూ దిక్కుతోచని స్థితిలో ఉన్న వారికి వాసుపల్లి అండగా నిలిచారు. ఆర్థిక సాయంతో పాటు అవసరమైన వైద్య సహాయం కూడా అందిస్తామని భరోసా ఇచ్చారు.

వలంటీర్లను రోడ్డున పడేశారు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆనందంగా ఉన్న వలంటీర్లను కూటమి ప్రభుత్వం రోడ్డున పడేసిందని వాసుపల్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వస్తే వలంటీర్లకు జీతాలు డబుల్ చేస్తామంటూ దొంగ హామీలిచ్చిన చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ యువతను తీవ్రంగా మోసం చేశారని మండిపడ్డారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తీరు మార్చుకుని వలంటీర్లకు తిరిగి ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్, పార్టీ విశాఖ జిల్లా సెక్రటరీ పద్మనాభం అమ్మాజీ, వార్డు నాయకుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులకు వ్యక్తి అప్పగింత



బాలగణేష్‌రెడ్డిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న సీఐ ఎర్రంనాయుడు

అల్లిపురం: ఇంటి నుంచి బయటకు వెళ్లి కనిపించకుండా పోయిన వ్యక్తిని పట్టుకున్న టూ టౌన్ పోలీసులు శుక్రవారం అతడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాలిలా.. అల్లిపురం కుమ్మర వీధికి చెందిన చాట్ల బాలగణేష్‌రెడ్డి ఈ నెల 12న కుటుంబంలో కలహాల కారణంగా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈ మేరకు అతడి తండ్రి చాట్ల వెంకటరమణ, సోదరుడు చాట్ల సత్యనారాయణరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన హెడ్ కానిస్టేబుల్ జి.శ్రీనివాసరెడ్డి సాంకేతికను ఉపయోగించి గాజువాక పరిసర ప్రాంతాల్లో గణేష్‌రెడ్డి ఉన్నట్లు గుర్తించారు. శుక్రవారం అతడిని టూ టౌన్ సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు సమక్షంలో తండ్రి, సోదరుడికి అప్పగించారు.

సీఆర్‌ఏఎఫ్'కు పూర్తి అనుమతులివ్వాలి

మద్దిలపాలెం: రాష్ట్రంలో బాలల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం గతేడాది స్థాపించిన చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం(సీఆర్ఏఎఫ్) సంస్థ తన కార్యకలాపాలను విస్తృత పరచడంలో ప్రభుత్వ పూర్తి అనుమతులు జారీ చేయాలని ఫోరం అధ్యక్షురాలు గొండు ధనలక్ష్మి, న్యాయ సలహాదారు ఎ.ప్రవీణ కోరారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల నుంచి అనుమతులు జారీ చేసేలా దరఖాస్తు చేశామని శుక్రవారం ఒక ప్రకటనలో వారు పేర్కొన్నారు. రాష్ట్ర విద్య, స్త్రీ, శిశు సంక్షేమ, కార్మిక సంక్షేమ, సాంఘిక సంక్షేమ, విభిన్న ప్రతిభావంతులు, వైద్య, ఆరోగ్య, హోం , దేవదాయ శాఖలతోపాటు మరిన్ని శాఖలకు దరఖాస్తు చేశామన్నారు. ప్రధానంగా బాలలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కరించాలన్నదే ప్రధాన ఉద్దేశమని చెప్పారు. పాఠశాలలు, మోడల్ స్కూళ్లు, ప్రభుత్వ కళాశాలలు, వివిధ ప్రభుత్వ సంక్షేమ శాఖల వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాల సందర్శనకు అనుమతివ్వాలని కోరారు. ఫోరం తరఫున రూపొందించే వివిధ బాలల చట్టాలు, హక్కులపై అవగాహన పెంపొందించే పోస్టర్లు, స్టిక్కర్లు, వీడియో క్లిప్పింగ్స్, ప్రసార, ప్రచార మాధ్యమాల్లోనూ, సోషల్ మీడియాలో ప్రచారం చేయనున్నామని తెలిపారు. ఈ ప్రచారాలపై కాపీరైట్ చట్టాలను అనుసరించి తక్షణ చట్ట ప్రకారం చర్యలకు ప్రత్యేక అనుమతులు కోరుతూ రాష్ట్ర హోం శాఖ ఉన్నతాధికారులకు దరఖాస్తు చేశామన్నారు. త్వరలోనే పూర్తి స్థాయి ప్రభుత్వ అనుమతులు రాగానే తమ చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం విస్తృత స్థాయిలో పిల్లల సేవలు అందించనున్నట్టు ధనలక్ష్మి, ప్రవీణలు పేర్కొన్నారు.